క్లుప్తంగా

ఉపాధ్యాయులకు ఆరోగ్య పరీక్షలు



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

రేగిడి: మండలంలో ఖండ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యుడు సునీల్‌కుమార్ ఆరోగ్య పరీక్షలు చేశారు. దేశ్‌కా ప్రకృతి పరీక్షా అభియాన్ యాప్ ద్వారా ఉపాధ్యాయులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా అందించారు. ఆయుర్వేద వైద్యం ద్వారా ప్రజల ఆరోగ్య రక్షణకు ఈ యాప్ ఉపయోగపడుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గులివిందల నాగభూషణదొర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆహ్వాన పత్రికలు



తాము రూపొందించిన ఆహ్వాన పత్రికలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

రాజాం: మండలంలో పెనుబాక యూపీ స్కూల్ విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. త్వరలో జరుగనున్న పేరెంట్స్ మీటింగ్‌కు సంబంధించి ఆహ్వాన పత్రికలు తయారు చేశారు. న్యూ ఇయర్ గ్రీటింగ్ మాదిరిగా ఈ పత్రికలను రూపొందించారు. గైడ్ కె.మధుసూదనరావు పర్యవేక్షణలో వీటిని తయారు చేశారు. పాఠశాల ఆవరణలో బుధవారం సీఎంఓ ఆదిరానారాయణ, ఏపీఓ గోపీచంద్‌ల సమక్షంలో వాటిని ప్రదర్శించారు.

కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బొబ్బిలి: పట్టణంలోని అభిమాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ రెడ్డి రాజగోపాల నాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం ద్వారా సంఘ కార్యాలయంలో మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. ప్రవాసాంధ్రుడు మిండి శ్రీనివాసరావు వాటిని సమకూర్చినట్లు రాజగోపాలనాయుడు తెలిపారు. కార్యక్రమంలో కాజా గోపాలరావు, గేదెల చంద్రినాయుడు, గోనా చంద్రశేఖర్, రేవళ్ల కిరణ్, బ్రహ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణికి అభినందన



రోహిణిని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

తెర్లాం: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించిన తెర్లాం హైస్కూల్‌కు చెందిన క్రీడాకారిణి రోహిణిని పాఠశాల హెచ్‌ఎం ఎస్‌ఎస్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ గత నెల 28 నుంచి 30వరకు కాకినాడలో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెర్లాం హైస్కూల్‌కు చెందిన ఎల్.రోహిణి జిల్లా జట్టు తరఫున పాల్గొందని తెలిపారు. ఆ పోటీల్లో రోహిణి అత్యుత్తమ ఆటతీరుతో జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఆమె మరిన్ని పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

ఫిజియోథెరపీతో ఆశించిన ఫలితాలు



చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు

రేగిడి: భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు బుధవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ రమాచంద్రిక విద్యార్థులతో చిన్న చిన్న వ్యాయామాలు చేయించారు. పిల్లలతో ఇంటి వద్ద చేయించాల్సిన వ్యాయామాలపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్నారులతో క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయించడం ద్వారా ఆశించిన ఫలితాలు కనిపిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య, సహిత విద్య ఉపాధ్యాయులు యు.మహేశ్వరి, టి.రాజేష్, సీజీవీ అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కపైనే వాడిపోతున్న చిక్కుడు కాయలను దిగాలుగా చూపుతున్న రైతు ఈశ్వరరావు. (ఇన్‌సెట్లో) నేల రాలిన చిక్కుడు కాయలు





కూరగాయ రైతుకు కలసిరాని కాలం

- నిండా ముంచిన ఫెంగల్ తుఫాన్
- పంటలను ఆశిస్తున్న చీడపీడలు
- నేలరాలుతున్న పూత, పిందె
- నష్టపోయిన రైతన్న

రామభద్రపురం: ఆరుగాలం కష్టపడినా రైతన్నకు కాలం కలసి రావడంలేదు. ఫెంగల్ తుఫాన్ కారణంగా రెండు మూడు రోజులుగా కురిసిన వర్షానికి కూరగాయల రైతులు తీవ్రంగా నష్టపోయారు. తుఫాన్ కారణంగా పొట్టి చిక్కుడు పంటకు తెగుళ్లు సోకి పూత, పిందె రాలిపోతున్నాయి. కింద రాలిన చిక్కుడు పిందెలను చూసి రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. ఖరీఫ్ సీజన్ మొదట్లో విత్తిన విత్తనం మొలకెత్తకుండా వరుణుడు ముఖం చాటేశాడు. తర్వాత అధిక వర్షాలతో పంటను ముంచెత్తాడు. వాతావరణ ప్రతికూలతలను తట్టుకుని అనేక అవస్థలు పడుతూ రైతులు చిక్కుడు సాగు చేశారు. అప్పులు చేసి మదుపులు పెట్టి ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేస్తే.. పూత వచ్చి పిందె కడుతుందన్న సమయంలో ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పంట తుడిచిపెట్టుకుపోయింది.

వందలాది ఎకరాల్లో పంట నష్టం

జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో దాదాపుగా 3 వేల హెక్టార్లలో కూరగాయల పంటలు సాగవుతున్నాయి. రామభద్రపురం మండలంలో 400 నుంచి 500 హెక్టార్లలో సుమారుగా 2000 మంది రైతులు బీర, చిక్కుడు, వంగ, బెండ, కాకర, క్యాబేజీ వంటి కూరగాయ పంటలు సాగుచేస్తున్నారు. 50 హెక్టార్లలో సుమారు 500 మంది రైతులు పొట్టి చిక్కుడు తోటలు సాగుచేస్తున్నారు. అధిక వర్షాల కారణంగా కూరగాయ పంటలకు వివిధ రకాల తెగుళ్లు సోకుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రకృతి విపత్తులకు తోడు తెగుళ్లు సోకడంతో పెట్టుబడులు సైతం కోల్పోయే పరిస్థితి నెలకొంది. పొట్టి చిక్కుడు పంట పూత, పిందె దశలకు చేరుకున్న సమయంలో కాండం తొలుచు పురుగు, వేరుకుళ్లు తెగులు, వివిధ రకాల చీడపీడలు ఆశించి పంటను నాశనం చేస్తున్నాయి. దీంత రైతులు దిక్కుతోచని స్థితిలో పడి విలవిలలాడుతున్నారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు మొక్కలు ఎదుగుదల లేకపోవడం, మొక్క చనిపోవడం జరుగుతుంది. అలాగే వేరుకుళ్ల తెగులు సోకిన మొక్కలు ఆకులు వాడిపోతూ, పూత పిందె రాలిపోతోందని, పంట చేతికొచ్చే లోపే పాడవుతోందని రైతులు వాపోతున్నారు. తెగుళ్ల నివారణకు ఎన్ని పురుగుమందులు వాడినా ప్రయోజనం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చిక్కుడు పంటను సాగు చేసేందుకు ఒక్కో రైతు ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. తాము అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి కష్టపడి పండించినా తెగుళ్ల ఆశించడంతో నష్టాల బారిన పడుతున్నామని వాపోతున్నారు.



మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి..

ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు రామభద్రపురం గ్రామానికి చెందిన చొక్కాపు ఈశ్వరరావు. ఇతడు సుమారు ఎకరా విస్తీర్ణంలో పొట్టి చిక్కుడు పంట సాగు చేస్తూ దాదాపు రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టాడు. అయితే పంట చేతికందే సమయంలో ఫెంగల్ తుఫాన్ రావడంతో తెగుళ్లు సోకి చూస్తుండగానే కాయలు వాడిపోయి నేలపాలవుతున్నాయి. పెట్టుబడి పోయే పరిస్థితి నెలకొంది. పంట సాగుకు అధికంగా పెట్టుబడులు పెట్టడంతో పాటు కుటుంబమంతా ఆరుగాలం కష్టపడినా ప్రకృతి సహకరించడంలేదని చెట్టుమీదే వాడిపోతున్న చిక్కుడు కాయలు చూపుతూ ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు.

పరిశీలిస్తాం..



సాధారణంగా నీరు అధికంగా ఉన్న భూముల్లో వేరుకుళ్ల తెగులు సోకుతుంది. కూరగాయల పంటల్లో నీరు నిల్వ ఉండకుండా బయటకు తీసేయాలి. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి నష్టాలను అంచనా వేస్తాం. ఉద్యానశాఖాధికారులు చెప్పిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. కూరగాయల పంటల్లో అంతర పంటగా బంతి, కొత్తిమీర, వంటి వాటిని వేస్తే మంచిది.

– పి.మోహనకృష్ణ, హెచ్‌ఓ, రామభద్రపురం

తీవ్రంగా నష్టపోయాం..

గత పది సంవత్సరాలుగా కూరగాయల పంటలు సాగు చేస్తున్నాం. అందులో ఎక్కువగా పొట్టి చిక్కుడు పంట సాగు చేస్తాను. వాతావరణ పరిస్థితులు కారణంగా కూరగాయల పంటకు ఇంతగా తెగుళ్లు సోకడం ఇదే మొదటసారి చూస్తున్నాను. క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినా తెగుళ్లు, పురుగులు వదల లేదు. ఎకరా విస్తీర్ణంలో చిక్కుడు వేశాను. అప్పు చేసి రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టాను. పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాల కారణంగా పంట పూర్తిగా పాడవడంతో అప్పుల పాలయ్యాను.

– చొక్కాపు చిన్నంనాయుడు, రైతు, రామభద్రపురం

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్

తెర్లాం: మండలంలోని రైస్ మిల్లర్లంతా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గల రైస్ మిల్లులను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన తరువాత రైస్ మిల్లుకు తీసుకువచ్చినపుడు వెంటనే అన్‌లోడ్ చేయాలన్నారు. రైతులు వాహనాలపై రైస్‌మిల్లుకు తెచ్చిన ధాన్యాన్ని సకాలంలో అన్‌లోడ్ చేయని మిల్లర్లపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేదిలేదని ఆయన హెచ్చరించారు. మిల్లర్లు ట్రక్‌షీట్‌ల ప్రకారమే ధాన్యం నిల్వ చేయాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

పంట బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించాలి



రేగిడి: కొర్లవలసలో పంటలబీమాపై అవగాహన కల్పిస్తున్న ఏఓ మురళీకృష్ణ



బాడంగి: డొంకినవలసలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఏఓ శిరీష

రేగిడి: రైతులు, కౌలు రైతులు తాము సాగుచేస్తున్న పంటలకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని ఏఓ జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని కొర్లవలస గ్రామంలో బుధవారం పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. ఎకరా విస్తీర్ణంలో వరి పంటకు రూ.630, మొక్కజొన్నకు రూ.540, పెసరకు రూ.300, మినుమలకు రూ.300 చొప్పున ప్రీమియం చెల్లించాలని సూచించారు. మండలంలో 119 మంది కౌలు రైతులను గుర్తించామని, బ్యాంకులో క్రాప్ రుణాలు పొందిన ప్రతీ రైతుకు ప్రధాన మంత్రి పసల్‌బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బంకి హరనాథరావు, సర్పంచ్ బంకి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

● **బాడంగి:** రైతులు వారు పండిస్తున్న పంటలకు వారే బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి కె.శిరీష అన్నారు. మండలంలోని డొంకినవలస, బాడంగి గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అపరాలకు రూ.300, మొక్కజొన్నకు రూ.540, వరికి రూ.630, మామిడికి రూ.2వేలు చొప్పిన ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అపరాలు, మామిడి, మొక్కజొన్నకు ఈనెల 15లోగా, వరికి 31లోగా ప్రీమియం చెల్లించాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏలు జయలక్ష్మి, మురళి, ఏబీసీ కోఆర్డినేటర్ రవికుమార్, రైతులు పాలొన్నారు.

● **బొబ్బిలి రూరల్:** మొక్కజొన్న, పెసలు, మినుములు వంటి అపరాల పంటలకు 2024–25 ఏడాదికి సంబంధించి బీమా ప్రీమియం మొత్తాన్ని ఈనెల 15లోగా రైతులు చెల్లించాలని వ్యవసాయశాఖ ఏఓ మజ్జి శ్యాంసందర్ తెలిపారు. పంటల బీమా వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. వరి పంటకు ఈ నెల 31లోగా ఎకరాకు రూ.480, మొక్కజొన్నకు రూ.540లు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల మదింపునకు 'నాస్'



రాజాం: పెనుబాక పాఠశాలలో నాస్ పరీక్షను పర్యవేక్షిస్తున్న అధికారులు



బాడంగి: పాల్తేరులో నాస్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

రాజాం: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల మదింపునకు నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) పరీక్షను పెనుబాక, బొద్దాం, కంచరాం, పొగిరి, డోలపేట, తదితర గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో బుధవారం నిర్వహించారు. ఈ పరీక్షలను ఎంఈఓ బి.ప్రవీణ్‌కుమార్, సీఎంఓ వి.ఆదినారాయణ, ఏపీఓ వి.గోపీచంద్ తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ..మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, నాస్ సెల్, ఎన్‌సీఈఆర్టీ, సీబీఎస్‌ఈ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ సంస్థలు సంయుక్తంగా ఈ సర్వే చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 3,6,9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

● **రేగిడి:** మండలంలోని పలు పాఠశాలల్లో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలు బుధవారం నిర్వహించారు. ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. చూసిరాతలకు అవకాశం ఇవ్వకుండా పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

● **బాడంగి:** మండలంలో ఎంపిక చేసిన పాఠశాలల్లో బుధవారం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలు నిర్వహించారు. కోడూరు, పాల్తేరు పాఠశాలల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు 48 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓలు లక్ష్మణదొర, రాజేశ్వరి చెప్పారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు ఏ మేరకు ఉన్నాయో పరీక్షించేందుకు ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

ఆస్పత్రిలో నాణ్యతలేని భోజనం



రోగుల వద్ద వివరాలు అడిగితెలుసుకుంటున్న సూపరింటెండెంట్

రాజాం సిటీ: స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో నాణ్యతలేని భోజనం అందిస్తున్నారని రోగులు వాపోయారు. ప్రతిరోజు ఇలాగే జరుగుతోందని, అడిగినా స్పందనలేదని తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులంతా సూపరింటెండెంట్ కరణం హరిబాబుకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఆయన వార్డులో పర్యటించి రోగుల వద్ద వివరాలు సేకరించారు. ఇకమీదట భోజనంలో నాణ్యత ఉండేలా చూస్తామన్నారు.

నేటి నుంచి విశాఖకు ఆర్టీసీ సర్వీస్

రాజాం సిటీ: రాజాం నుంచి విశాఖపట్నంకు ఆర్టీసీ ఫస్ట్ బస్సు ఈ నెల 5 నుంచి ప్రారంభించనున్నామని పాలకొండ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ సర్వీసు ప్రతి రోజు ఉదయం 4.30 గంటల నుంచి చిలకపాలెం మీదుగా విశాఖపట్నం వెళ్తుందని పేర్కొన్నారు. ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

బాడంగి: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 6 నుంచి జనవరి 4 వరకు నెలరోజుల పాటు రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుధాకర్ బుధవారం తెలిపారు. రెవెన్యూ సభలపై గ్రామాల్లో ముందస్తు సమాచారం అందిస్తామని, ఆయా తేదీల్లో గ్రామస్తులంతా అందుబాటులో ఉండాలని కోరారు.

7న మెగా పెరెంట్స్ డే

బాడంగి: ఈనెల 7న అన్ని పాఠశాలల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంఈఓ లక్ష్మణదొర తెలిపారు. సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్‌ఎంసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ మెరుగుపడాలి

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను కార్యకర్తలు, ఆయాలు సక్రమంగా నిర్వహించాలని రాజాం సీడీపీఓ డాక్టర్ కనకదుర్గ సూచించారు. బూరాడ, ఉంగరాడమెట్ట, వండానపేట, కేఎంవలస గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాలకు వస్తున్న సరుకుల వివరాలు, లబ్ధిదారులకు అందజేస్తున్న పోషకాహార సామాగ్రి రికార్డులను పరిశీలించారు. చిన్నారుల గ్రోత్‌పై ఆరాతీశారు. సూపర్‌వైజర్ సుజాత, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేట జంక్షన్‌లో బుధవారం ఎస్ఐ ఆర్.గోపాలరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడిపేవారిపై అపరాధ రుసుం విధించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, వాహనాలు ఇస్తే సదరు వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

బొబ్బిలి రూరల్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ సంఘ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఈఓ గొట్టాపు వాసుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇంతగా సమస్యలు లేవని, ఈ కొత్త ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నామని తెలిపారు. సెలవు రోజుల్లో కూడా విధులు నిర్వహించాల్సి వస్తోందని వాపోయారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఈనెల 4,11,16 తేదీల్లో వివిధ రూపాల్లో ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి తమ సమస్యలను తెలియజేస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. జిల్లా సహాధ్యక్షుడు ప్రసన్నకుమార్, కేశవరావు, రమేష్ పాల్గొన్నారు.

రామభద్రపురం: విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలు రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద బుధవారం యూటీఎఫ్ నేతలతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం ఎంఈఓ తిరుమల ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు సుధాకరరావు, ప్రధాన కార్యదర్శి శంకరరావు, ఎం.జ్యోతి, శశిభూషణరావు, శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న సిబ్బంది

తెర్లాం: విద్యార్థులంతా తప్పనిసరిగా ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దివ్యభారతి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ స్వస్థ్య కార్యక్రమం)లో భాగంగా బుధవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆర్‌బీఎస్‌కేలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల ఎత్తు, బరువు, కంటి చూపు, చర్మ వ్యాధులు, హిమోగ్లోబిన్, తదితర అన్నింటినీ తనిఖీ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. విద్యార్థులు అనారోగ్యంగా ఉంటే అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భాస్కరరావు, తెర్లాం ఎంఎల్‌హెచ్‌పీ వై.శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నిరాధార ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు

మెంటాడ: నిరాధారమైన ఆరోపణలతో వార్తలు రాయడం సరికాదని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మాజీ సైనికులు ఎవరికి డబ్బులు ఇచ్చారో చెప్పాలని, ఊహాజనిత వార్తలు రాయవద్దని ఆంధ్రజ్యోతి పత్రికకు హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే రాజన్నదొర ఎంతో నిబద్ధతతో పనిచేసే వ్యక్తి అని, అందుకే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ప్రజలు ఆయన్ను ఎన్నుకున్నారన్నారు. మాజీ సైనికులకు ఇచ్చిన పట్టాలు, మెంటాడ ఎస్సీ కాలనీ వాసులకు ఇచ్చిన డీపట్టాలు రద్దు కావడానికి అప్పటి తహసీల్దార్ సరైన పద్ధతిలో చేయడం వల్లే జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, ఎస్సీసెల్ అధ్యక్షుడు చిన్నారావు, కె.త్రినాథ, సర్పంచ్ సూర్యనారాయణ, తదితరులున్నారు.

పెనుబాకలో వైద్యసేవలు



గ్రామంలో క్లోరినేషన్ చేయిస్తున్న వైద్యులు, సిబ్బంది

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సిద్ధేశ్వరి, డాక్టర్ నరేంద్ర వైద్యసేవలు అందించారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి డయేరియాపై ఆరాతీశారు. గ్రామంలో డయేరియా ప్రభావం లేదని, ప్రజలు భయాందోళనలు చెందొద్దని సూచించారు. తాగునీటి పరీక్షల్లో కూడా ఎటువంటి సమస్యలేదని వచ్చినట్లు చెప్పారు. ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. ప్రతీ ఇంటివద్ద క్లోరినేషన్ కార్యక్రమాలు చేయించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, సర్పంచ్ బండి బోడమ్మ, తదితరులు పర్యవేక్షించారు.

హిందువులపై దాడులు అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంస్థల ప్రతినిధులు

బొబ్బిలి: బంగ్లాదేశ్‌లో హిందువులపై మారణకాండ జరగడం దారుణమని పట్టణానికి చెందిన హిందూ ధార్మిక సంస్థలు, ప్రజా సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. ఈ మేరకు బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ సాగించారు. హిందూ సంస్థల ప్రతినిధులు స్వామినాయుడు, పువ్వల శ్రీనివాసరావు, సుంకరి సాయిరమేష్, కొల్లూరు జగన్నాథరావు, చెలికాని కేశవ, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: మండలంలోని కుమ్మరిపేట గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేజీబీవీలో విద్యార్థులకు పెట్టిన మధ్యాహ్న భోజనాలను, సరుకుల నిల్వలను, మరుగుదొడ్లను, తరగతి గదులను, విద్యాలయం పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ కేజీబీవీలో చదువుతున్న బాలికలకు నాణ్యమైన భోజనాన్ని పెట్టాలని, మెనూ ప్రకారం భోజనాలు పెట్టకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. సరుకుల నిల్వలు ఎప్పటికప్పుడు పరిశీలించి సరుకుల ముగింపు తేదీ గమనించాలని, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ప్రత్యేకాధికారికి సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు.